తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)

కథలపోటీలో సాధారణ

ప్రచురణకి ఎన్నికైన కథ




సాయంత్రం నాలుగయింది, విష్ణుకోసం ఎదురుచూస్తూ వరండాలో నిలబడింది రమ! కాన్వెంట్ పిల్లల్ని సందిట్లో దాచుకుని వచ్చే కామరాజు రిక్షా కనచూపుమేరలో కన్పించలేదు. "నాలుగయ్యేసరికిరావాలే? ఇంకారాలేదేమిటి?" అనుకుంది రమ మరోసారి! అసలే శీతాకాలం! చల్లగాలి ఒక్కసారి తాకినట్లు అన్పించి నీరెండ లోకి జరిగింది రమ, ఇపుడు వీధి చివరవరకూ కన్పిస్తోంది, అపుడే వీధి చివరవున్న ప్రైమరీ స్కూల్ విడిచిపెట్టారు.

గేటు తెరవగానే, పంజరంలోంచి ఒక్కసారిగా ఎగురుకుంటూ వచ్చిన రామచిలుకల్లా ఆకుపచ్చ డ్రెస్ వేసుకున్న స్కూలు పిల్లలు ఒక్కసారిగా పరుగులు తీసారు. కొందరు ఇళ్ళకి దారితీస్తే మరి కొందరు ఆటస్థలంలోకి దారితీసారు, కొంతమంది గేటుదగ్గరే, జంతికలతట్ట పెట్టుకుని, అమ్ముతున్న ముసలమ్మ దగ్గర చేరారు.

మాసిన చీర! రేగిపోయినజుట్టు! అపుడే పొయ్యి దగ్గరనుంచి లేచి వచ్చినట్లుంది ఆ ముసలమ్మ, రెండు చేతుల్తో తలగోక్కుంటూ, అలాగే పిల్లలకు జంతికలు తీసి ఇస్తోంది, కడుపులో దేవినట్లయింది రమకు, పిల్లలు మాత్రం అదేమీ పట్టించుకోకుండా, కొనుక్కున్న జంతి కల్ని తింటూ, స్నేహితులకి విరిచిపెడ్తూ కబుర్లు చెప్ప కుంటూ, కేరింతలు కొడ్తూ సాగిపోతున్నారు.

విష్ణు గుర్తుకువచ్చాడు రమకు, 'వాడుకూడా ఇలాగే కొనుక్కుతింటాడా?' అనుకోగానే ఒళ్ళు జలదరించింది. "ఛీ, అలా కొనుక్కోవటానికి అదేం వీధిబడి కాదుగా! పేరున్న కాన్వెంటాయె, ఆ కాన్వెంట్ పక్కన ఇలా చిరు తిళ్ళు అమ్మనివ్వరు!" అనుకుని సమాధాన పడి, మరింత కంగారుగా విష్ణుకోసం ఎదురుచూడ సాగింది, కాసేపట్లో పరుగులు తీస్తూ వచ్చాడు విష్ణు, ఆలోచనలలోపడి రిక్షా రావటాన్ని, పోవటాన్ని గమనించ లేదు రమ!

దగ్గరకు వచ్చి 'అమ్మా'! అని పిలిచిన కొడుకుని మురిపెంగాచూసింది.

డ్రెస్ నలగలేదు! బూట్ల పాలిష్ మాయలేదు,

ప్రొద్దున్న వెళ్ళినపుడు ఎంత నీట్‌గా వెళ్ళాడో ఇప్పుడూ అలాగే వచ్చాడు!

కాకపోతే కాస్త వడలినట్లున్నాడు, క్రాపు చెదిరింది అంతే అనుకుంది.

కాసేపటిక్రితం తను చూసిన వీధి బడిపిల్లలు గుర్తుకు వచ్చారు.

వెలిసిపోయిన యూనిఫాం! మాసిపోయిన పుస్తకాల సంచిలు! తెగిపోయిన చెప్పులు! శుభ్రంగా లేనిమొహాలు! ముఖం వికారంగా పెట్టి విష్ణుతోపాటు ఇంట్లోకి నడి చింది రమ!.

ఇంట్లోకి వస్తూ, "ప్రొద్దున్న నాదగ్గర తీసుకున్న అర్ధ రూపాయి ఏంచేశావురా నాన్నా?" అడిగింది లాలనగా.

"ఎక్లయిర్ చాక్‌లెట్ కొనుక్కున్నాను" - బుద్ధిగా సమాధానం చెప్పాడు విష్ణు! "ఎక్లయిర్ ముప్పై అయిదు పైసలేగా, మిగిలిన పదిహేను పైసలు ఏంచేశావు?" మళ్ళీ అడిగింది రమ.

"మేము బయటకొనుక్కోకుండా స్కూల్లోనేస్వీట్ షాపు పెట్టారమ్మా! అక్కడ చాక్‌లెట్ ఫిఫ్టీపైస్ అమ్మా!"-

"పోన్లే పదిహేనుపైసలేగా ఎక్కువ! నువ్వు బయట కొనుక్కోలేదు, అదేచాలు!"

ఇంతలో రఘు వచ్చాడు! అప్పటివరకు తల్లితో చెప్పని విషయాన్ని తండ్రికి చెప్పాడు విష్ణు!

"డాడీ! మాకు ప్రోగ్రెస్ రిపోర్టు ఇచ్చారు"-

"వెరీ గుడ్! ఎన్నోరాంక్ వచ్చింది?" - అడిగాడు రఘు బట్టలు మార్చుకుంటూ.

"టెన్త్‌రాంక్ డాడీ!" అన్నాడు విష్ణు తనకూడా బట్టలు మారుస్తూ, తల్లివైపు భయంగా చూస్తూ.

ఆమాట వింటూనే కోపంతో వూగిపోయింది రమ.

"మళ్ళీ టెన్త్ రాంకేనా? చచ్చెచెడి చెప్పానుకదురా, నువ్వసలు సరిగా రాసావా? వందలుపోసి నిన్ను చదివించేది ఎందుకురా? ఫస్టువస్తే చూసి మురిసిపోవాలని కదూ!" - అంటూ వెనక ముందు ఆలోచించకుండా విష్ణుని కొట్టింది రమ! విష్ణు వెక్కివెక్కి ఏడుస్తూ, కాళ్ళు కడుక్కునివస్తున్న తండ్రిని చుట్టేసుకున్నాడు.

"ఎందుకు రమా? ఏమైందని అలా కొడ్తావ్?" కోపంగా అన్నాడు రఘు.

"మళ్ళీ క్లాసుఫస్టు రాలేదండీ!" - అంతకంటే కోపంగా జవాబిచ్చింది రమ!

"ఫస్టు రాలేదని, పసిపిల్లల్ని పట్టుకుని అలాకొడ్తారా? ఈ సారి బాగా చదివి తెచ్చుకుంటాడు!". కొడుకుని ఎత్తుకుంటూ అన్నాడు రఘు!

"మీరలా వెనకేసుకొస్తూంటేనే చదువుసంధ్య లేకుండా వెత్తికెక్కుతున్నాడు" ఉక్రోషంగా అంది రమ!

"అయిదోక్లాసు చదివే పిల్లాడికి క్లాసు ఫస్టు తెచ్చుకోవాలని ఏం తెలుస్తుంది చెప్పు? ఇంత చిన్న వయస్సులో, అంత చదువు చదువుతున్నందుకే మనం సంతోషించాలి, ఆ చిన్న బుర్రలో ఎన్నని జ్ఞాపకం వుంటాయి, ప్రతిదానికి వర్రీకాకు! వెళ్ళి కాఫీ తీసుకురా! వాడికి కూడా కాంప్లాన్ కలుపు!"-

"ఆ కాంప్లాన్ కలుపుతాను, ఫీజు ఏభై, రిక్షా ఏభై, కాంప్లాన్ ఏభై చదువుమాత్రం సున్నా! పనిమనిషిని కూడా పెట్టుకోకుండా చాకిరీ చేసుకుంటున్నాను!" విసురుగా అంది రమ!

"ఇప్పటి నుంచే లాభనష్టాల విషయంగురించి ఆలో చిస్తున్నావన్నమాట, నీలాంటి తల్లులే, కొడుకులకి పెళ్ళిళ్ళు చేసేటప్పుడు, చదువులకింత ఖర్చయిందని, కట్నాలు గుంజుతారు"-

"ఏంటండీ మీ వెక్కిరింపు? వాడు క్లాసు ఫస్టు రాలేదని బాధపడటంపోయి... నాకెంత బాధగా వుందో తెలుసా? నాచిన్నప్పుడు స్కూలుకి వెళ్ళే దారిలో ఒక కాన్వెంట్ వుండేది! అపుడే కొత్తగా కట్టారుదాన్ని, చుట్టూ కోటగోడలాంటి ప్రహరీ, లోపల పెద్ద బిల్డింగ్, దాని చుట్టూ రకరకాల క్రోటన్సు, లోపలికివెళ్ళి చూస్తే చాలనిపించేది, వాచ్‌మాన్ వెళ్ళనిచ్చేవాడుకాదు. అదేదో రాయల్ హౌస్‌లా కన్పించేది! నాకు పిల్లలుపుడ్తే అలాంటి స్కూల్లోనే చదివించాలని, వాళ్ళు బాగా చదువుకుని పెద్ద ఆఫీసర్లు అవ్వాలని కలలుగనేదాన్ని!" కన్నీళ్ళతో అంది రమ!

"వీధిబడిలో చదువుకుంటే మాత్రం ఏం? నిన్ను ఐ ఎ ఎస్ పరీక్షలకి పంపితే, అరచేతిలో ఆర్డర్సుతో వస్తావు, నీ తెలివితేటలు నీపిల్లాడికి రాకుండా వుంటాయి?"- అంటూ భార్యని పొగిడాడు రఘు!

'మరే!' అంటూ మూతి తిప్పింది రమ!

"మూతి తిప్పకు! ముట్టుకోవాల్సి వస్తుంది!" చిన్నగా నవ్వుతూ చిలిపిగా అన్నాడు!

** ** **

హాఫ్ ఇయర్లీ పరీక్షలు వారంరోజుల్లోకి వచ్చాయి. తీరిక దొరికినప్పుడల్లా కొడుకుని చదివిస్తూనే వుంది రమ! ఉన్నట్టుండి ఒకరోజు విష్ణు తండ్రితో అన్నాడు - "డాడీ, నేను మాస్కూలు బోర్డింగ్‌లో చేరతాను"- అని!

"ఎందుకురా?"- ఆదుర్దాగా అడిగింది రమ!

"ఒక్కడేనాయె, వాడితో ఆడుకోటానికి ఎవ్వరూ లేరని కాబోలు" - భార్యవంక చూస్తూ చిన్నగా అన్నాడు రఘు! భర్త హాస్యం పట్టించుకోలేదు రమ! "ఏంకాదు, టి.వి. చూడనివ్వకుండా, పిల్లలతో ఆడుకో నివ్వకుండా ఒస్తమానం చదవమంటున్నానని కదూ!"- అంది రమ బాధగా!

"కాదమ్మా! క్లాసు ఫస్టురాకపోతే నీకు కోపం వస్తుంది! ఫస్టువచ్చే పిల్లలు బోర్డింగ్‌లోనే వుంటారు! పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను సిస్టర్సు వాళ్ళకి ముందే చెప్పే స్తారు! అందుకే వాళ్ళకే మార్కులు ఎక్కువ వస్తాయి! నేనుకూడా బోర్డింగ్‌లో చేర్తే, నాక్కూడా ఫస్టు వస్తుంది"- అమాయకంగా అన్నాడు విష్ణు!

తల్లిదండ్రులిద్దరూ నిర్ఘాంతపోయారు.

"నీకొచ్చిన మార్కులే చాలులేరా!"- అంది రమ కొడుకుని దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంటూ!